సాక్షి నంద్యాల
బుధవారం । 1 । మే । 2024



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: ఆలయ ప్రాంగణంలో శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామికి మంగళవారం పూజలు నిర్వహించారు.



ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై మంగళవారం తిరుపతి తిరుచానూరుకు చెందిన శివనాట్య కళా నిలయం వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



శ్రీమఠం హుండీ లెక్కింపు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠం 33 రోజుల హుండీల ఆదాయం రూ.2,71,83,973 సమకూరినట్లు మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు.

న్యూస్‌రీల్

హోం ఓటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించండి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో వృద్ధులకు, దివ్యాంగులకు కల్పించిన హోం ఓటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, శ్రీనివాసులు మైక్రో అబ్జర్వర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో హోమ్ ఓటింగ్ ప్రక్రియపై మైక్రో అబ్జర్వర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో సుమారు 15,509 విభిన్న ప్రతిభావంతులు, 5 వేల మంది 85 సంవత్సరాలు నిండిన సీనియర్ సిటిజన్లు ఉన్నారని, ఇంటి వద్దనే ఓటు వేసే హక్కును ఎన్నికల కమిషన్ కల్పించిన నేపథ్యంలో హోం ఓటింగ్ ప్రక్రియను సజావుగా పూర్తిచేసేందుకు 45 మంది మైక్రో అబ్జర్వర్లను నియోజకవర్గాలకు కేటాయించామన్నారు. సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్రకుమార్, సూక్ష్మ పరిశీలకులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల్లో నిఘా ఉంచండి



వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

మహానంది: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది నిఘా పెంచాలని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశించారు. నంద్యాల-గిద్దలూరు మార్గంలో ఆంజనేయపురం చెక్‌పోస్టు వద్ద మంగళవారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ మేరకు ఎస్పీ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ నగదు, బంగారు, ఇతర విలువైన వస్తువుల అక్రమ రవాణాపై నిఘా ఉంచాలన్నారు. స్పెషల్ బ్రాంచ్ సీఐ రవీంద్ర, రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉక్కిరిబిక్కిరి

- గోస్పాడులో 46.3 డిగ్రీల ఉష్ణోగ్రత

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు ఉక్కిరిబిక్కిరి చేశాయి. కర్నూలు జిల్లా కల్లూరులో 46.3, నంద్యాల జిల్లా గోస్పాడులో 46.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. నంద్యాల జిల్లాలోని నాలుగు మండలాల్లో 45 డిగ్రీలకు పైగా, 11 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మహానందిలో 45.6, డోన్‌లో 45.5, బనగానపల్లిలో 45.5, నందికొట్కూరులో 45.2 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రోజుల్లో 45 నుంచి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు.


సొమ్ము సిల్లాల్సిందే!

ఎప్పుడు ఒకటో తారీఖు వస్తుందా..

ఎప్పుడెప్పుడు పింఛను సొమ్ము చేతికి అందుతుందా అని అవ్వాతాతలు, దివ్యాంగులు, ఇతర పింఛనుదారులు ఎదురుచూస్తుంటారు. మొన్నటి వరకు వలంటీర్లు ఇంటి తలుపు తట్టి పింఛను సొమ్ము చేతికి అందిస్తే.. ఇప్పుడు చంద్రబాబు కుట్రల కారణంగా పింఛను సొమ్ము చేతిలో పడేంత వరకు చుక్కలు చూడాల్సి వస్తోంది. ఒక్కోసారి ఒక్కో విధంగా రాజకీయాలు చేస్తుండటంతో పింఛనుదారుల అవస్థలు అన్నీఇన్నీ కావు. గత నెలలో ఎర్రని ఎండకు సచివాలయాల వద్ద పడిన కష్టాలు మరువక ముందే.. చంద్రబాబు మే నెల పింఛను బ్యాంకు ఖాతాలకు జమచేయాలని ఒత్తిడి చేయడంతో ఇప్పుడు బ్యాంకుల వద్ద క్యూకట్టాల్సి రావడం గమనార్హం.

పండుటాకులతో చంద్రబాబు ఆటలు

- గడప దాటింది.. బ్యాంకు మెట్లెక్కింది!
- బ్యాంకుల్లో పింఛను సొమ్ము వేయాలని ఎన్నికల కమిషన్‌కు వినతి
- ఈ కారణంగా పింఛనుదారులకు తప్పని అవస్థలు
- డబ్బు డ్రా చేసేందుకు మళ్లీ మండుటెండలో పాట్లు
- ప్రభుత్వంపైనే దుష్ప్రచారానికి సిద్ధమైన తెలుగుతమ్ముళ్లు
- నేడు 1,05,431 పింఛన్లు డోర్ టు డోర్ పంపిణీ
- 3,59,311 మందికి డీబీటీ ద్వారా నగదు బదిలీ



ఏప్రిల్ నెలలో ఇద్దరు మృతి

టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వాకంతో ఏప్రిల్ నెలలో పింఛన్లు తీసుకునేందుకు వెళ్లి ఇద్దరు మృత్యువాత పడ్డారు. పాములపాడు మండలం మద్దూరు గ్రామానికి చెందిన సానె తిరుపాలు (74), పాణ్యం మండలం మద్దూరు గ్రామానికి చెందిన వితంతువు ముల్లా నూర్జహాన్(54) మృతి చెందారు.

కర్నూలు(అగ్రికల్చర్): చంద్రబాబు పాపం.. అవ్వాతాతలు, ఇతర పింఛనుదారులకు శాపంగా మారింది. పండుటాకులు ఏప్రిల్ నెల పింఛను పొందడంలో.. మే నెలలో పడబోయే కష్టాలు, కన్నీళ్లకు తెలుగు తమ్ముళ్లతో పాటు, పచ్చ మీడియా కారణమైంది. మే నెలలో కూడా చంద్రబాబు కుట్రల కారణంగా 3,59,311 మంది పింఛనుదారులు సుదూర ప్రాంతాల్లోని బ్యాంకుల మెట్లు ఎక్కాల్సి వచ్చింది. దాదాపు ఐదేళ్లు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటి దగ్గరే వలంటీర్ల ద్వారా పింఛను పొందుతూ వచ్చారు. 2014-15 నుంచి 2018-19 వరకు చంద్రబాబు పాలనలో పడిన కష్టాలను మరిచిపోయారు. మళ్లీ అదే చంద్రబాబు కారణంగా గత నెలలో 46 డిగ్రీల ఎండ తీవ్రతలో సచివాలయం మెట్లు ఎక్కించారు. మే నెలలో పింఛనుదారుల నివాసాలకు సుదూరంగా ఉండే బ్యాంకుల మెట్లు ఎక్కాల్సి వచ్చింది. ఇప్పుడు కూడా 46 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంది. పింఛనుదారులు అన్ని గ్రామాల్లో ఉన్నా.. బ్యాంకులు అన్ని గ్రామాల్లో లేవు. పింఛను కోసం పండుటాకులు కనీసం 10 కిలోమీటర్ల దూరంలోని బ్యాంకులకు వెళ్లక తప్పని పరిస్థితి. ఏప్రిల్ నెలలో వడదెబ్బకు గురై 32 మంది పింఛనుదారులు మరణించారంటే పరోక్షంగా చంద్రబాబు కారణమయ్యారనే విషయం అందరికీ తెలిసిందే.

పింఛన్ల పంపిణీ ఇలా..

జిల్లా	మొత్తం పింఛన్లు	డోర్ టు డోర్	డీబీటీ
కర్నూలు	2,46,340	54,244	1,88,096
నంద్యాల	2,22,402	51,187	1,71,215
మొత్తం	4,68,742	1,05,431	3,59,311

యంత్రాంగం మొత్తం ఎన్నికల కమిషన్ అధీనంలోనే...

ఎన్నికల కోడ్ రావడంతోనే యంత్రాంగం మొత్తం ఎన్నికల కమిషన్ అధీనంలోకి వెళ్లిపోయింది. ఏది చేసినా ఎన్నికల కమిషన్ అనుమతితోనే చేయాల్సి ఉంది. డీబీటీ ద్వారా పింఛను సొమ్ము బదిలీ చేయాలని చంద్రబాబు ఎన్నికల కమిషన్‌ను కోరడం.. చంద్రబాబు కోరిన విధంగానే ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. కోడ్ అమలులో ఉండటం.. యంత్రాంగం మొత్తం ఎన్నికల కమిషన్ అధీనంలో ఉండటంతో పింఛన్లు ఇంటి దగ్గరే పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. ఈ విషయం పచ్చబ్యాచ్‌కి, పచ్చ మీడియాకు తెలిసినా పింఛన్లు ఇంటిదగ్గరే పంపిణీ చేయాలని ఇప్పుడు గగ్గోలు పెట్టడం వింత కాక మరేమిటి అనే చర్చ జరుగుతోంది. డీబీటీ ద్వారా పింఛను పంపిణీ చేయాలని అడిగిందీ చంద్రబాబే.. ఇప్పుడు ఇంటిదగ్గరే పింఛన్లు అంటూ యాగీ చేస్తుందీ చంద్రబాబే కావడం గమనార్హం.

చంద్రబాబు కోరడంతోనే..

ఏప్రిల్ నెల చివరిలో పింఛన్లను సచివాలయాల దగ్గర పంపిణీ చేయవద్దు.. బ్యాంకు ఖాతాలకు పింఛను సొమ్ము విడుదల చేయాలని ఎన్నికల కమిషన్‌ను చంద్రబాబు కోరారు. ఇందుకు అనుగుణంగా ఎన్నికల కమిషన్ డీబీటీ ద్వారా పింఛన్ల పంపిణీకి ఆదేశాలు ఇచ్చింది. దీనిపై పింఛనుదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో చంద్రబాబు మళ్లీ కొత్త రాగం అందుకున్నారు. కాదు.. కాదు ఇంటి వద్దే పింఛన్లు ఇవ్వాలని కోరడం చంద్రబాబు రెండు నాల్కల ధోరణికి నిదర్శనం.

నేటి నుంచి 1,05431 మందికి డోర్ టు డోర్ పింఛన్ల పంపిణీ

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4,68,732 పింఛన్లు ఉండగా.. 1,05,431 మంది పింఛనుదారులకు డోర్ టు డోర్ పంపిణీ చేయనున్నారు. వికలాంగులు, డీఎంహెచ్‌ఓ, కిడ్నీ రోగులు, వీల్‌చైర్, బెడ్‌కు పరిమితమైన వారు, సైనిక్ వెల్ఫేర్ పింఛనుదారులకు ఇంటిదగ్గరే పింఛన్లు పంపిణీ చేస్తారు. కర్నూలు జిల్లాలో 54,244, నంద్యాల జిల్లాలో 51,187 పింఛనుదారులకు నగదును సచివాలయ ఉద్యోగులు ఇంటిదగ్గరే అందిస్తారు. మంగళవారం ఇందుకు సంబంధించి రూ.32,03,78,500 బ్యాంకులకు విడుదలయ్యాయి. ఈ సొమ్మును వార్డు, గ్రామ సచివాలయాల సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు డ్రా చేశారు. బుధవారం ఉదయం నుంచే పంపిణీ చేయనున్నారు. ఎన్నికల కోడ్ ఉండటం వల్ల పింఛన్ల పంపిణీపై ఎలాంటి ప్రచారం చేయరాదు. పంపిణీని ఫొటోలు, వీడియోలు తీయరాదు. పింఛన్లు పంపిణీ చేసే సచివాలయ ఉద్యోగుల వద్ద విధిగా ఎంపీడీవో జారీ చేసిన ఆథరైజేషన్ లెటర్ ఉండాలి.

3,59,311 మంది బ్యాంకు ఖాతాలకు పింఛను సొమ్ము

ఉమ్మడి కర్నూలు జిల్లాలో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) ద్వారా 3,59,311 మంది పింఛనుదారుల బ్యాంకు ఖాతాలకు బుధవారం నగదు బదిలీ చేయడానికి రంగం సిద్ధమైంది. రూ.107,79,18,000 బ్యాంకు ఖాతాలకు బదిలీ కానుంది. వీరిలో అవ్వాతాతలే అధికంగా ఉన్నారు. కర్నూలు జిల్లాలో 1,88,096 మందికి, నంద్యాల జిల్లాలో 1,71,215 మంది పింఛనుదారుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ కానుంది. బ్యాంకు ఖాతాలకు నగదు జమకాకపోతే ఇళ్ల దగ్గరే పింఛను సొమ్ము అందించనున్నారు.

13 తర్వాత మీ అంతు చూస్తా..!

- నీ చక్రపాణిరెడ్డిని పిల్చుకుని రాపో
- వైఎస్సార్‌సీపీ నేతలను బెదిరించిన టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి



సోమయాజులపల్లెలో వైఎస్సార్‌సీపీ నేతలతో వాగ్వాదానికి దిగిన బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

సాక్షి, నంద్యాల: 'రేయ్...ఏం పేరురా?.. రేయ్ చక్రపాణి నువ్వు రారా...నీ చక్రపాణిరెడ్డిని పిల్చుకొచ్చుకోపో, సిగ్గులేని నాయాల్లారా' అంటూ శ్రీశైలం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులపై బూతులు తిడుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బండిఆత్మకూరు మండలం సోమయాజులపల్లె గ్రామంలో మంగళవారం బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో రోడ్లు వేసింది మేమే...అంటూ ప్రసంగిస్తూ వైఎస్సార్‌సీపీ వాళ్లు చేసిందేమి లేదంటూ స్థానిక నాయకులపై మండిపడ్డారు. దీంతో ఈ గ్రామంలో ఒకడు చక్రపాణి ఉన్నాడంటూ మొదలుపెట్టగా వైఎస్సార్‌సీపీ నేత చక్రపాణి, ఎంపీటీసీ రామయ్య, ప్రజలు బయటికి వచ్చారు. ఆ వెంటనే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆగ్రహంతో ఊగిపోతూ 'రేయ్ చక్రపాణి అరవాల్సిన పనిలేదు.. నేను ఇక్కడే ఉంటా, నీ ఎమ్మెల్యే చక్రపాణిరెడ్డిని పిల్చుకొచ్చుకో...బెదిరిస్తే భయపడతానా, సిగ్గులేని నాయాల్లారా అంటూ ఊగిపోయారు. పత్రికల్లో రాయలేని బూతులు తూలనాడటంతో అక్కడి వారంతా అసహ్యించుకున్నారు. 'చెప్తా, చెప్తా బిడ్డా నీ కథ, 13 అయిపోని చెప్తా' అంటూ ఆవేశంతో తిట్ల పర్వం మొదలుపెట్టారు. చివరికి గ్రామ నాయకులు అంతా ఏకం కావడంతో పాటు పోలీసులు జోక్యం చేసుకోవడంతో వెనుదిగిరి వెళ్లిపోయారు.

హాజీలకు శిక్షణా తరగతులు

నంద్యాల(వ్యవసాయం): హజ్‌యాత్రకు వెళ్లే హాజీలకు మూడవ దఫా శిక్షణా తరగతులను స్థానిక నేషనల్ పీజీ కళాశాలలో మంగళవారం జిల్లా హజ్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నేషనల్ విద్యాసంస్థల అధినేత ఇంతియాజ్ అహమ్మద్ హాజరై మాట్లాడారు. నంద్యాల జిల్లా నుంచి 122 మంది రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 3 వేల మంది హజ్‌యాత్రకు వెళ్తున్నారని తెలిపారు. హజ్‌యాత్రకు వెళ్లే హాజీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పాటించాల్సిన నియమ నిబంధనలు వివరించారు. మే 1 ఉదయం 10 గంటలకు ప్రభుత్వాసుపత్రిలో హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ వేయబడుతుందన్నారు. ఈ హజ్‌యాత్ర మే చివరి వారం కాని, జూన్ మొదటి వారంలో యాత్ర ప్రారంభమవుతుందన్నారు. యాత్రలో ఆళ్లగడ్డ, బనగానపల్లె, కోవెలకుంట్ల, నందికొట్కూరు, ఆత్మకూరు, వెలుగోడు, నంద్యాల పరిసరాల నుంచి హాజీలు బయల్దేరుతారన్నారు. కార్యక్రమంలో హజరత్ మౌలానా హఫీజ్ అబ్దుల్ హాదీసాహెబ్, జమాలుద్దీన్, మహమ్మద్ షరీఫ్, షేక్ రఫీ అహమ్మద్ షాహెబ్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలన్నీ అబద్ధాలే

- చంద్రబాబును ప్రజలు నమ్మరు
- కుప్పం కన్నా మిన్నగా డోన్ అభివృద్ధి
- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



యు. కొత్తపల్లె ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన

డోన్: చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ హామీలన్నీ బూటకమని, అందమైన, ఆకర్షణీయమైన అబద్ధాలని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా డోన్ మండలం యు. కొత్తపల్లె, ఉంగరానిగుండ్ల, సీసంగుంతల గ్రామాల్లో మంగళవారం ఆయన పలు సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014 ఎన్నికలలో చంద్రబాబు నాయుడు అబద్ధాలతో ప్రజలను ఆకర్షించి అధికారం చేపట్టి ఏ ఒక్క మంచి పని అయినా ప్రజల కోసం చేశారా అని నిలదీశారు. ప్రజలకు శాశ్వతంగా గుర్తుండిపోయే పనులను చేశానని చెప్పే దమ్ము, ధైర్యం బాబుకు లేదన్నారు. ప్రతి నెల సబ్సిడీపై ఒక సిలిండర్, డ్వాక్రా మహిళల రుణాల మాఫీ, రైతు రుణమాఫీ లాంటి అబద్ధాలతో ప్రజలను మోసం చేసిన చంద్రబాబును ప్రజలు మళ్లీ ఎలా నమ్ముతారన్నారు. సోమవారం డోన్‌లో జరిగిన టీడీపీ ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు తనపై చేసిన ఆరోపణలపై మంత్రి స్పందించారు. డోన్‌లో అభివృద్ధి ఎక్కడా..? అంటూ చంద్రబాబు మాట్లాడిన చోటనే డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, ఆధునిక కూరగాయల మార్కెట్, క్లబ్ హౌస్, ఇండోర్ స్టేడియం, మున్సిపల్ కార్యాలయం కనపడలేదా అని నిలదీశారు. కళ్లుండి అభివృద్ధిని చూడలేని కబోది చంద్రబాబు అని బుగ్గన మండిపడ్డారు. కుప్పం కన్నా అన్నిరెట్లు మిన్నగా డోన్‌ను మూడేళ్లలో అభివృద్ధి చేశాననే దానిపై నిరూపించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. కుప్పంను గత 30 ఏళ్లుగా చంద్రబాబునాయుడు ఎంతమేర అభివృద్ధి చేశారో అంతకు రెట్టింపు అభివృద్ధిని ఈ మూడేళ్లలో డోన్ నియోజకవర్గంలో చేశానని మంత్రి వివరించారు.

బాబు భవిష్యత్తుకు గ్యారెంటీ లేదు..

75 ఏళ్ల వయసులో కూడా అధికార దాహంతో దిగజారి ప్రవర్తిస్తున్న చంద్రబాబునాయుడు ప్రవర్తన చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. ఆయనతో పాటు కుమారుడు లోకేష్, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌ల భవిష్యత్తుకు గ్యారెంటీ లేనప్పుడు రాష్ట్రంలోని యువత భవిష్యత్తుకు గ్యారెంటీ ఎలా ఇస్తారని మంత్రి బుగ్గన నిలదీశారు. దేశంలో ఏ నాయకుడికి లేనివిధంగా ఆచరణ యోగ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టే నైజం చంద్రబాబుదన్నారు. ఎన్నికల ప్రచారంలో మంత్రి వెంట రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, కొత్తపల్లె సర్పంచ్ శ్రీవిద్య, కోఆప్షన్ సభ్యులు హుసేన్, ఎంపీటీసీ ఓబులేసు, ఉంగరానిగుండ్ల సర్పంచ్ శాంతమ్మ, సీసంగుంతల సర్పంచ్ సిద్దయ్య పాల్గొన్నారు.

అంతర్గత రహదారులు అద్భుతం

- పట్టణమంతా సీసీ రోడ్లు
- గడిచిన 58 నెలల్లో 142 సీసీ రోడ్ల నిర్మాణం
- రూ.28.48 కోట్లతో ప్రతి వీధి చివరకూ సీసీ రోడ్డు
- సుమారుగా 48.71కి.మీ మేర నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఎన్‌జీఓ కాలనీలో నూతన సీసీ రోడ్డు

నంద్యాల(సిటీ): గత దశాబ్దాలుగా నంద్యాల పట్టణంలో నెలకొన్న సమస్యలకు శాశ్వతంగా పరిష్కారం చూపింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. జిల్లా కేంద్రంగా మారడంతో అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తయయ్యాయి. నంద్యాల పట్టణంలో గత 58 నెలల కాలంలో సుమారుగా 142 సీసీ రోడ్లు మంజూరు చేయగా అందులో కేవలం ఆరు రోడ్లు మాత్రమే వివిధ కారణాల వల్ల ప్రారంభానికి నోచుకోలేదు. ఇందులో జనరల్ ఫండ్స్ నుంచి రూ.21.64 కోట్లతో 88 రోడ్లను 38.95 కి.మీ మేర వేశారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.2 కోట్లతో ఆరు రోడ్లు మంజూరు కాగా ఇందులో 4 రోడ్లు ప్రారంభం కాలేదు. ఎంపీ ల్యాడ్స్ ద్వారా రూ.0.71కోట్లతో ఐదు సీసీ రోడ్లు 1.28 కి.మీ మేర వేశారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా 43 రోడ్ల నిర్మాణానికి రూ.2.32కోట్లతో అనుమతులు రాగా ఇందులో 25 రోడ్లు పనులు పూర్తి చేశారు. మరో 16 రోడ్లకు సంబంధించిన పనులు టెండర్ దశలో ఉండగా రెండు రోడ్లకు సంబంధించిన పనులు ప్రారంభం కాలేదు. పట్టణంలోని ప్రధాన, అంతర్గత సీసీ రోడ్లు రూ.28.48 కోట్లతో పూర్తి చేసి ప్రజలకు రవాణా సదుపాయాన్ని కల్పించారు. గతానికి భిన్నంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి వీధి చివరకూ సీసీ రోడ్డును నిర్మించారు. అంతే కాకుండా ప్రతి సీసీ రోడ్డును ప్రధాన రహదారికి అనుసంధానం చేసి ప్రయాణాన్ని మరింత సులభతరం చేశారు.

నాడు అధ్వానం..

అడుగు పెట్టాలంటే ఎక్కడ ఏ గుంత ఉంటుందో అనే భయం. ఏదైనా కాలనీ నుంచి ప్రధాన రహదారికి చేరుకోవాలంటే ఆపసోపాలు పడాల్సిన పరిస్థితి. ఇక వర్షాకాలంలో ఆ బాధలు నంద్యాల ప్రజలకే తెలుసు. ముఖ్యంగా పద్మావతినగర్, ప్రియాంకనగర్‌లో గుంతల మయమైన రహదారులతో వాహన చోదకులు, పాదచారుల ఎక్కడ కిందపడే వారో తెలియని దుస్థితి. చినుకు పడితే చిత్తడిగా మారే రోడ్లు, రోడ్లపై పొంగి పారే మురుగు కాల్వలు. గత పాలకులు మాత్రం కేవలం రెండు, మూడు రోడ్లు వేసి తాము నంద్యాలకు ఏదో చేసేశామని అభూత కల్పనలతో ప్రజలను మభ్యపెట్టారు.

నేడు మెరిసే దారులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులకు పూర్తిగా ప్రాధాన్యత కల్పించి నంద్యాల పట్టణాన్ని జిల్లా కేంద్రంగా తీర్చిదిద్ది మరింత సుందరంగా మారింది. పట్టణంలో ప్రధాన రహదారులతో పాటు పుర వీధులలో సీసీ రోడ్లు, అనుసంధానంగా డ్రైన్లు నిర్మించారు. ఐదేళ్లలో అవకాశం ఉన్న ప్రతి చోట సీసీ రోడ్లతో నంద్యాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఇదే కాకుండా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి ఏళ్లుగా పేరుకుపోతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపుతూ నాడు ఒక్కో సచివాలయ పరిధిలోని మౌలిక సదుపాయాల కల్పనకు రూ.20 లక్షలు వెచ్చించారు.



నాడు.. ప్రియాంక నగర్‌లో రహదారికి చేరుకున్న మురుగునీరు



నేడు.. సీసీ రోడ్డు వేసిన దృశ్యం

ప్రతి వీధిలో రోడ్డు వేశారు



మేము సలీంనగర్‌లో గత 20 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాం. పట్టణంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు ప్రతి వీధిలో రోడ్లు వేశారు. గతంలో పద్మావతి నగర్ రోడ్డులో ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సి వచ్చేది. రోడ్డంతా గుంతలమయంగా ఉండేది. కానీ ఇప్పుడు అలా లేదు. చాలా విశాలమైన రోడ్లు, డ్రైన్లు నిర్మించారు. అంతే కాకుండా రోడ్డు ఎత్తును కూడా కొన్ని అడుగుల మేర పెంచారు. కాబట్టి కాల్వ నీళ్ల రోడ్డు పైకి వచ్చే ప్రసక్తి లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చాలా వరకు మౌలిక సదుపాయాలు పెద్ద ఎత్తున ప్రజలకు అందుతున్నాయి. మళ్లీ ఇలా ప్రజలందరికీ మంచి చేసే ప్రభుత్వమే రావాలి.

– ముర్తుజా, 35వ వార్డు సలీంనగర్, నంద్యాల

పట్టణం మారింది



నంద్యాల పట్టణంలో ప్రతి వీధిలో రోడ్లు వేశారు. గతంలో మేము ఉన్న ప్రాంతంలో చిన్న వర్షం పడితే చాలు రోడన్నీ చిత్తడి అయ్యేవి. కానీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి మా సమస్యలకు శాశ్వత పరిష్కారంగా కొత్త సీసీ రోడ్లను వేయించారు. నంద్యాల రూపురేఖలు పూర్తిగా మారాయనేందుకు నిదర్శనమే రోడ్లు, డ్రైన్లు. ఇంతకంటే అభివృద్ధిని ఇంకెవ్వరూ చేయలేరు. ఈ ప్రభుత్వంలో ఏదైనా చెప్తే తప్పకుండా చేస్తారనే నమ్మకం ప్రజల్లో ఉంది.

– మధుసూదన్, సాదిక్ నగర్, నంద్యాల

జిల్లా ఓటర్లు @13,89,307

- పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికం

నంద్యాల: జిల్లాలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునే ఓటర్ల తుది జాబితాను జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు మంగళవారం వెల్లడించారు. జిల్లాలో మొత్తం 13,89,307 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 6,80,402 మంది, మహిళలు 7,08,647 మంది, ఇతరులు 258 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా నంద్యాల నియోజకవర్గంలో 2,73,938 మంది ఓటర్లు ఉండగా అత్యల్పంగా శ్రీశైలం నియోజకవర్గంలో 1,96,116 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే 28,245 మంది అధికంగా ఉన్నారన్నారు. నామినేషన్ల ఉపసంహరణ పూర్తయిందని, రాజకీయ పార్టీలు, రిజిస్టర్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు వారి ఆప్షన్ మేరకు గుర్తులు కేటాయించామన్నారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఆళ్లగడ్డ	1,14,955	1,17,709	12	2,32,676
శ్రీశైలం	95,771	1,00,301	44	1,96,116
నందికొట్కూరు	1,06,689	1,11,340	18	2,18,047
నంద్యాల	1,32,992	1,40,856	90	2,73,938
బనగానపల్లె	1,18,112	1,23,043	24	2,41,179
డోన్	1,11,883	1,15,398	70	2,27,351
మొత్తం	6,80,402	7,08,647	258	13,89,307

క్లుప్తంగా

ఆర్‌యూ పీజీ విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు బుధవారం నుంచి ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని వర్సిటీ ఆర్ట్స్, సైన్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ ఎన్.టి.కె.నాయక్, ప్రొఫెసర్ సి.వి.కృష్ణారెడ్డి తెలిపారు. వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ ఆదేశాల మేరకు ఈనెల 1 నుంచి జూన్ 8వ తేదీ వరకు విద్యార్థులకు వేసవి సెలవులు ఇచ్చామని పేర్కొన్నారు. విద్యార్థులకు సిలబస్ పూర్తి చేడయంతో పాటు, అకడమిక్ షెడ్యూల్‌ను బలోపేతం చేసేందుకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వర్సిటీ రెగ్యులర్/ కాంట్రాక్ట్/ గెస్ట్ ఫ్యాకల్టీ అందరూ వర్సిటీలోని సంబంధిత డిపార్ట్‌మెంట్‌ల నుంచి ఆన్‌లైన్ తరగతులను కచ్చితంగా నిర్వహించాలని ఉత్తర్వుల్లో ఆదేశాలు జారీ చేశారు. వర్సిటీ హాస్టల్స్ సైతం బుధవారం నుంచి జూన్ 9వ తేదీ వరకు మూసివేస్తామని హాస్టల్స్ చీఫ్ వార్డెన్ పేర్కొన్నారు. 10వ తేదీ హాస్టల్స్ తెరుస్తామని తెలిపారు.

రెండు లారీల సీజ్

కర్నూలు (న్యూటౌన్): ఒంగోలు జిల్లా బుదవాడ నుంచి అక్రమంగా గ్రానైట్ స్లాబ్స్‌ను రవాణా చేస్తున్న రెండు లారీలను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి అక్రమంగా గ్రానైట్ స్లాబ్స్ రవాణా చేస్తున్నారనే సమాచారంతో జిల్లా మైనింగ్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్రమంగా గ్రానైట్ స్లాబ్స్ తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేసి రక్షణ నిమిత్తం కర్నూలు బస్ డిపోలో ఉంచారు. ఈ తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

కర్నూలు: కర్నూలు అనంతపురం జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో ఇరు జిల్లాల సెబ్ విభాగం పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. గుంతకల్లు, పత్తికొండ సెబ్ స్టేషన్ల పరిధిలోని గూండాల తండా, మొలకలపేట తండా పరిసర ప్రాంతాలు, మద్దికెర శివారులోని నాటుసారా స్థావరాలపై మంగళవారం ఇరు జిల్లాల అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. 2,900 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 70 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఇరు జిల్లాల సెబ్ అధికారులు మొత్తం నాలుగు కేసులు నమోదు చేశారు. పత్తికొండ, గుంతకల్లు సెబ్ సీఐలు స్వర్ణలత, పురుషోత్తంతో పాటు ఎస్‌ఐ కార్తీక్, సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీని వేగవంతం చేయండి



ఓటర్ స్లిప్పులను అందజేస్తున్న జేసీ

నంద్యాల(అర్బన్): పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు ఓటర్ స్లిప్పుల పంపిణీని వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్, నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాహుల్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీ 162, 163, 164 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ స్లిప్‌లు పంపిణీని జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ఇంటింటికి ఓటర్ స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. స్లిప్పుల పంపిణీలో అలసత్వం లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలందరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఓటు హక్కును ప్రతి ఓటర్ సద్వినియోగం చేసుకొని ఓటింగ్ శాతాన్ని పెంచాలని జేసీ వివరించారు.

చరిత్ర సృష్టించబోతున్నాం

- మోసాల బాబుకు మతి భ్రమించింది
- జగనన్న పాలనలో విద్య, వైద్యరంగాల్లో విప్లవాత్మక మార్పులు
- సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత
- ఎన్నికల ప్రచారంలో ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని





గుళ్లదూర్తిలో రోడ్‌షో నిర్వహిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చరిత్ర సృష్టించబోతోందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండవసారి సీఎం కాబోతున్నారని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం కోవెలకుంట్ల మండలంలోని గుళ్లదూర్తి, భీమునిపాడు, జోళదరాశి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం, రోడ్ షో నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యేతోపాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి పోచా శీలారెడ్డి, గ్రామ సచివాలయాల బనగానపల్లె నియోజకవర్గ కోఆర్డినేటర్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువనాయకుడు కర్రా తేజవర్ధన్‌రెడ్డి, ఏపీఎన్‌జీఓ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గువ్వలరామకృష్ణారెడ్డి, న్యాయ విభాగ జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కరుణాకర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బాలమద్దిలేటి, ఈర్నపాటి నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ బీసీ సంఘం జిల్లా కార్యదర్శి అమడాల శంకరయ్య, తదితరులతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్‌షో సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇచ్చి పరిపాలన చేస్తున్నారన్నారు. గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో రూ. 2.80 లక్షల కోట్లను వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు నేరుగా ఖాతాల్లో జమ చేసిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేసి ఆయా రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. నాడు- నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల రూపురేఖలు మార్చివేశారని పేర్కొన్నారు. నంద్యాల నుంచి కోవెలకుంట్ల మీదుగా వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు వరకు జాతీయ రహదారి మంజూరైందని, త్వరలో పనులు చేపట్టబోతున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గడిచిన ఐదేళ్ల కాలంలో బనగానపల్లె నియోజకవర్గంలో రూ. 1,645 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గుళ్లదూర్తి గ్రామ సచివాలయ పరిధిలో రెండు గ్రామాలకు డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా రూ. 25.42 కోట్ల మేర లబ్ధి చేకూరిందని వెల్లడించారు. సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

చంద్రబాబుకు మతి భ్రమించింది..

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు మతి భ్రమించిందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఎద్దేవా చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు ఆయనను చంపితే ఏమవుతుందని వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంపై కాటసాని ఆగ్రహం వ్యక్తంచేశారు. 75 ఏళ్ల వయస్సు 40 సంవత్సరాల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు నిగ్రహం కోల్పోయి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు చేస్తుంటే ఓర్వలేక రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని ప్రచారం చేసిన దుర్మార్గుడని అని విమర్శించారు.

సూపర్ సిక్స్‌ను ప్రజలు నమ్మరు..

త్వరలో ఎన్నికలు జరగబోతుండటంతో సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని అపద్ధపు హామీలతో ప్రజల్లోకి వస్తున్నారన్నారు. ఈ పథకాలు అమలు చేస్తే అప్పుడు రాష్ట్రం శ్రీలంక కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న చంద్రబాబు ఏ ఒక్క సంక్షేమ పథకం అమలు చేయలేదని, ఒక్క రూపాయి కూడా ప్రజల ఖాతాల్లో వేయలేదని విమర్శించారు. పేదలకోసం కేటాయించిన బడ్జెట్ అంతా ఎక్కడికి పోయిందని దుయ్యబట్టారు. ప్రచారంలో గుళ్లదూర్తి వైఎస్సార్‌సీపీ నాయకులు పేరా నాగార్జునరెడ్డి, పొట్టిపాటి శ్రీనివాసరెడ్డి, వివేకానందరెడ్డి, డాక్టర్ నాగేశ్వరరెడ్డి, శివరామిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, శశిధర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, రుషికేశ్వరరెడ్డి, కర్నాటి రామిరెడ్డి, శ్రీరాముల అబ్రహం, మూర్తిరెడ్డి, మౌలాలి, భాస్కర్, మల్లికార్జునరెడ్డి, అరవిందరెడ్డి, ఓబుళరెడ్డి, రామకృష్ణారెడ్డి, నాగిరెడ్డి, లక్ష్మిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఎర్రం సుబ్బారెడ్డి, బత్తుల వెంకట సుబ్బయ్య, బాలనాగిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బాలనాగిరెడ్డి, కానాల చంద్ర, భీమునిపాడు నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి, చిన్న నరసింహారెడ్డి, వీరారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జోళదరాశి నాయకులు రాంశంకర్‌రెడ్డి, పోతం రాంమోహన్‌రెడ్డి, ఈర్నపాటి సుబ్బరాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారానికి ముందస్తు అనుమతి తప్పనిసరి

- పాణ్యం నియోజకవర్గ ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య



మాట్లాడుతున్న ఆర్వో మౌర్య

కర్నూలు(సెంట్రల్): సాధారణ ఎన్నికలు-2024 కు సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గ బరిలో ఉన్న అభ్యర్థులు ప్రచారం చేసుకోవడానికి ముందస్తు అనుమతి తీసుకోవాలని పాణ్యం నియోజకవర్గ ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌లో పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గ బరిలో ఉన్న అభ్యర్థులతో ఆమె సమావేమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బరిలో ఉన్న అభ్యర్థులు ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించుకోవాలంటే ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు.అనుమతులు లేకుండా ప్రచారం చేసినా, ర్యాలీలు నిర్వహించినా, వాహనాలను వినియోగించినా సీజ్ చేస్తామన్నారు. సువిధ యాప్ ద్వారా 48 గంటల ముందే దరఖాస్తు చేసుకున్నట్లైతే అనుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. అత్యవసర సమయం అయితే నేరుగా వచ్చి అనుమతులు తీసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 12వ తేదీన ఈవీఎంల మొదటి విడత ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేశామని, త్వరలోనే రెండో విడత చేపడతామన్నారు. బుధవారం నుంచి ఓటరు స్లిప్పు లను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే వ్యక్తి రూ.40 లక్షలు ఖర్చు చేయవచ్చన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు సంబంధించి పాణ్యం నియోజకవర్గానికి కర్నూలులోని బీ క్యాంపు బాయ్స్ ఉన్నత పాఠశాలలో ఫెసిలిటేషన్ సెంటర్‌ను కేటాయించారని, అర్హులైన ఓటర్లు మే 6,7,8 తేదీలో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కల్లూరు తహసీల్దార్ మునివేలు, పాణ్యం అసెంబ్లీ బరిలో ఉన్న అభ్యర్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గాలకు అదనపు బ్యాలెట్ యూనిట్లు

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు



నంద్యాల: లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో నోటాతో కలిపి అభ్యర్థుల సంఖ్య 17 నుంచి 32 లోపు ఉంటే రెండు బ్యాలెట్ యూనిట్లు అవసరమవుతాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు రాజకీయ పార్టీ ప్రతినిధులతో అన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో పోలింగ్ నిర్వహణకు అవసరమయ్యే బ్యాలెట్ యూనిట్ల కేటాయింపు విషయంపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన తర్వాత నంద్యాల పార్లమెంటుకు సంబంధించి 31 మంది, నందికొట్కూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 18, బనగానపల్లెలో 28, ఆళ్లగడ్డలో 18, శ్రీశైలంలో 18, నంద్యాలలో 28, డోన్‌లో 16 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారన్నారు. పోలింగ్ నిర్వహణలో భాగంగా బ్యాలెట్ యూనిట్‌లో నోటాతో కలిపి అభ్యర్థుల సంఖ్య 17కు మించితే అదనపు బ్యాలెట్ యూనిట్ వినియోగించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని నంద్యాల పార్లమెంటు నియోజకవర్గంతో పాటు ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలో అభ్యర్థులు లెక్కకు మించి ఉండటంతో అదనపు బ్యాలెట్ యూనిట్లను అమర్చి పోలింగ్ నిర్వహించాల్సిన పరిస్థితి ఉందన్నారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నంద్యాల పట్టణంలోని టెక్కె మార్కెట్ యార్డులో ఉన్న స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన 245 బ్యాలెట్ యూనిట్లను డోన్ అసెంబ్లీ నియోజకవర్గానికి తరలించే ప్రక్రియలో పాల్గొని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మరో 3,325 బ్యాలెట్ యూనిట్లు బెంగళూరు నుండి తెప్పిస్తున్నామని వాటిని బెల్ ఇంజనీర్లతో ఎఫ్‌ఎల్‌సీ చేయించి సంబంధిత నియోజకవర్గాలకు చేరవేస్తామని కలెక్టర్ వివరించారు.

ఆ ముగ్గురు.. ఎవరికి వారే !

- నందికొట్కూరు టీడీపీలో విచిత్ర పరిస్థితి
- చంద్రబాబు సభకు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి దూరం
- ఎన్నికల ప్రచారంలో కలవని మాండ్ర, గౌరు
- 2019 నాటి ఫలితం రిపీట్ అవుతుందనే భయమే కారణమా?

జూపాడుబంగ్లా: సార్వత్రిక ఎన్నికల వేళ నందికొట్కూరు నియోజవకర్గంలో టీడీపీ నేతలు ఒకరినొకరు దూరంగా ఉంటూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. మాండ్ర శివానందరెడ్డి అభ్యర్థిని ప్రతిపాదించిన నేత, గౌరు వెంకటరెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జ్, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సీనియర్ నేత.. ఇలా ముగ్గురు టీడీపీలో ఉన్నా ఎన్నికల ప్రచారంలో మాత్రం ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. వీరి వైఖరికి గత ఎన్నికల ఫలితాలు రిపీట్ అవుతాయనే భయమే కారణంగా ఓటర్లు చర్చించుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో ఇప్పటి వరకు వీరు ఒకే వేదికపై కనిపించలేదు. 2019 ఎన్నికలకు ముందు వరకు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాండ్రశివానందరెడ్డిని చింగ్‌చాంగ్ అంటూ నిక్‌నేమ్‌తో పిలవటంతో పాటు ఆయన ఎక్కడికి వెళ్లినా మాండ్రశివానందరెడ్డి, గౌరువెంకటరెడ్డిలను తీవ్రంగా విమర్శించేవారు. అనంతరం బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి టీడీపీ తీర్థం పుచ్చుకొని 2019 ఎన్నికల ప్రచారంలో గౌరువెంకటరెడ్డి, మాండ్రశివానందరెడ్డిలతో కలిసిపోయారు. అయితే వీరి కోసమా తాము గ్రామాల్లో ఫ్యాక్షన్‌కు పాల్పడి జైలుపాలైందంటూ ఆనాడు బైరెడ్డి, గౌరు అనుచరులు తీవ్రంగా ఆవేదన చెందారు. ఆ కారణంతోనే వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేను బంపర్‌మెజార్టీతో గెలిపించారు. ఆనాటి నుంచి నేటి వరకు మళ్లీ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మాండ్ర శివానందరెడ్డి, గౌరు వెంకటరెడ్డి ఒకే స్టేజీపై కలిసిన దాఖలాల్లేవు. అయితే రెండు నెలల క్రితం బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఆయన కుమార్తె శబరి చంద్రబాబు సమక్షంలో మళ్లీ టీడీపీ తీర్థం పుచ్చుకొని నంద్యాల ఎంపీ సీటును దక్కించుకొన్నారు. మాండ్ర శివానందరెడ్డికి నియోజకవర్గంలో అంతగా పట్టులేదనే కారణంతో చంద్రబాబునాయుడు గౌరువెంకటరెడ్డిని నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్‌గా చంద్రబాబునాయుడు నియమించారు. పేరుకే మాండ్రశివానందరెడ్డి ప్రతిపాదించిన జయసూర్యకు ఎమ్మెల్యే సీటిచ్చినట్లు ఉన్నా గౌరువెంకటరెడ్డి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సహకారం లేనిదే అభ్యర్థిని గెలిపించుకోలేడనే నిర్ణయానికి చంద్రబాబు వచ్చినట్లయింది. గౌరును నందికొట్కూరు ఇన్‌చార్జ్‌గా నియమించినప్పటికీ ఆయన ఏనాడు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన దాఖలాల్లేవు. అలాగే మాండ్రశివానందరెడ్డి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించిన దాఖలాల్లేవు. రెండు రోజుల క్రితం నందికొట్కూరులో చంద్రబాబు నిర్వహించిన బహిరంగ సభలో ఒకే స్టేజీపై మాండ్రశివానందరెడ్డి, గౌరువెంకటరెడ్డి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కలిస్తే 2019 నాటి చరిత్ర రిపీట్ అవుతుందనే ఉద్దేశంతోనే బైరెడ్డిరాజశేఖర్‌రెడ్డి చంద్రబాబు బహిరంగసభకు గైర్హాజరయ్యారని చర్చించుకుంటున్నారు.

పెద్దాసుపత్రికి ఆధునిక వైద్య పరికరాలు

- ఏసీలతో ఏఎంసీ ఆధునికీకరణ
- హెచ్‌డీఎస్ నిధులు రూ.కోటి ఖర్చు
- జిల్లా కలెక్టర్ సహకారంతో పనులు పూర్తి చేసిన ఆసుపత్రి సూపరింటెండెంట్



రూ.36లక్షలతో కొనుగోలు చేసిన డెక్సా స్కాన్ వద్ద జిల్లా కలెక్టర్, ఆసుపత్రి అధికారులు

కర్నూలు(హాస్పిటల్): మండే ఎండలు. బయటే కాదు ఇంట్లో కూడా ఉండలేని పరిస్థితి. అది కూడా ఒక్క నిమిషం ఫ్యాన్ లేకుండా నిలబడలేని స్థితి. ఆరోగ్యంగా ఉన్న వారికే ఇలాగుంటే రోగుల పరిస్థితి ఎలాగుంటుందో అర్థం చేసుకోవచ్చు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని వార్డులు పరిశీలించేటప్పుడు ఇలాంటి ఇబ్బందులను గమనించిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి వెంటనే ఇలాంటి సమస్యలను పరిష్కరించాలని భావించారు. సమస్యలను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చేశారు. ఈ మేరకు నిత్యం ఉక్కపోతతో అల్లాడిపోయే ఏఎంసీ రోగులు ఇకపై చల్లని వాతావరణంలో సేదతీరనున్నారు. ఈ మేరకు ఏఎంసీని ఏసీలతో ఆధునీకరించారు. అందులో అదనంగా మూడు వెంటిలేటర్లు, ఆరు సక్షన్ ఆపరేటర్లు అమర్చారు. దీంతో వివిధ అనారోగ్య పరిస్థితుల్లో ప్రాణాపాయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్న వారు, పాముకాటుకు గురై అత్యవసర చికిత్స పొందేవారు, వివిధ ప్రమాదాల్లో గాయపడి చికిత్స పొందేవారు త్వరగా కోలుకునేందుకు వీలవుతోంది. ఈ మేరకు ఆధునీకరించిన ఏఎంసీని మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన పరిశీలించారు. అక్కడ నిర్వహించిన పనులను ప్రశంసించారు. అనంతరం రూ.36లక్షలతో కొనుగోలు చేసి డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన డెక్సా స్కాన్‌ను ఎండోక్రైనాలజీ విభాగానికి అప్పగించారు. ఈ అధునాతన పరికరం ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్టమొదటిసారిగా ప్రభుత్వ ఆసుపత్రిలో, రాష్ట్రంలోనే రెండో మిషన్ ఇది. దీనివల్ల బోన్ మినరల్ డెన్సిల్ క్యాల్షియం, టోటల్ బాడీ ఫ్యాట్ పర్సంటేజ్ లాంటివి లెక్కించవచ్చు. ఇది పోస్టు మేనోపోజ్‌ను ఎదుర్కొనే మహిళలకు, చాలా మంది ఆర్థోపెడిక్స్ రోగులకు, ఎండోక్రైనాలజీ రోగుల్లో క్యాల్షియం లెవెల్స్ కనుగొనేందుకు చాలా ఉపయోగపడుతుంది. అనంతరం జిల్లా కలెక్టర్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాన్ని సందర్శించారు. అందులో నూతనంగా ఏర్పాటు చవేసిన ఒక గ్యాస్ట్రో స్కోప్, ఒక కొలనోస్కోప్, ఈఆర్‌సీపీ స్కోప్‌లను పరిశీలించారు. వాటి పనితీరు, ఆయా పరికరాల ద్వారా చేసే స్కానింగ్ వివరాలను కనుగొన్నారు. అత్యాధునిక పరికరాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉండాలన్నారు. వీటితో పాటు గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నెఫ్రాలజీ విభాగాలకు ఒక్కోటి రూ.12లక్షలతో కొనుగోలు చేసిన అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్లను ఆయా విభాగాలకు అప్పగించారు. ఆయా విభాగాల్లో అత్యవసర సమయాల్లో రోగులను పరీక్షించేందుకు ఈ పరికరాలు ఉపయోగపడతాయని ఆసుపత్రి అధికారులు ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన, మెరుగైన వైద్యసేవలు అందించేందుకు గాను దాదాపు రూ.ఒక కోటితో వైద్యపరికరాల కొనుగోలు, ఆధునీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. వైద్యులు వీటిని సద్వినియోగం చేసుకుని రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. రాష్ట్రంలోనే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు, ఇక్కడి వైద్యులకు మంచి పేరుందన్నారు. ఆ పేరును కొనసాగిస్తూ వైద్యసేవలు అందించాలన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ.. జిల్లా కొనుగోలు కమిటీ ద్వారా రాష్ట్రంలోనే మొట్టమొదటి డెక్సా స్కాన్ యంత్రాన్ని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏర్పాటు చేశామన్నారు. ఏఎంసీ విభాగంలో 13 ఎయిర్ కండిషనర్లు, నూతన కర్టెన్లు, వెంటిలేటర్లు, సక్షన్ ఆపరేటర్లతో ఆధునీకరించామన్నారు. అలాగే గ్యాస్ట్రో ఎంట్రాల.ఈ విభాగంలో గ్యాస్ట్రోస్కోపీ, కొలనొస్కోపీ, ఈఆర్‌సీపీ స్కోపీతో పాటు గ్యాస్ట్రిక్, నెఫ్రాలజీ విభాగాలకు రెండు స్కానింగ్ మిషన్లు కొనుగోలు చేశామన్నారు. కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ పి. శ్రీనివాసులు, డాక్టర్ రాధారాణి, డాక్టర్ మోహన్‌రెడ్డి, డాక్టర్ సీతారామయ్య, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ వెంకటేశ్వర్లు, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉర్దూ వర్సిటీకి వేసవి సెలవులు

కర్నూలు కల్చరల్: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీకి బుధవారం నుంచి వేసవి సెలవులు ప్రకటించారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు. వర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఫజులుర్ రహమాన్ ఆదేశాల మేరకు ఈనెల 1 నుంచి 31వ తేదీ వరకు వర్సిటీకి వేసవి సెలవులు ఇచ్చామని పేర్కొన్నారు. జూన్ 1వ తేదీన వర్సిటీ పునః ప్రారంభమవుతుందని తెలిపారు.

దేవదాయ శాఖ ఎస్‌ఈగా సతీష్

కర్నూలు కల్చరల్: దేవదాయ శాఖ మల్టీజోన్-2 ఎఫ్ఏసీ ఎస్‌ఈగా ఈఈ సిరిగుప్ప సతీష్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఎస్‌ఈగా విధులు నిర్వహిస్తున్న సి.సి.పుల్లయ్య మంగళవారం పదవీ విరమణ పొందారు. ఆయన స్థానంలో ఎఫ్ఏసీ ఎస్‌ఈగా ఈఈ సతీష్ బాధ్యతలు స్వీకరించారు. ఫుల్ అడిషినల్ ఛార్జ్ ఎస్‌ఈకి ఆ శాఖ డీఈఈ, ఏఈలు శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటి నుంచే ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్

కర్నూలు(సెంట్రల్): గతంలో మాదిరిగా ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం నేరుగా కార్యాలయానికి వచ్చి ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని జిల్లా ఉపాధి కల్పన అధికారి పి.దీప్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటి నుంచి సులభంగా పది, ఇంటర్, డిగ్రీ, పీజ ఉత్తీర్ణులైన వారు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు. ఇందు కోసం www.employment.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఎంప్లాయ్‌మెంట్ ఆన్‌లైన్ సైట్‌లోకి వెళ్లి సెల్‌నంబర్, ఈ మెయిల్, ఆధార్ నంబర్లను ఇచ్చి లాగిన్ కావాలన్నారు. తరువాత పూర్తి వివరాలను నింపితే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. అలాగే ఈ సైట్ నుంచి జాబ్ మేళాలు జరిగే ప్రదేశాల సమాచారం కూడా అభ్యర్థులకు నేరుగా చేరుతుందన్నారు.

ఉద్యాన రైతుకు ఉదార సాయం

ఉద్యాన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల ఇలా..

సంవత్సరం	దెబ్బతిన్న విస్తీర్ణం (హెక్టార్లలో)	బాధిత రైతులు	పరిహారం (రూపాయల్లో)
2019	1,455.71	2,496	2.2 కోట్లు
2020	2,587.41	4,440	7.17 కోట్లు
2021	1,410.46	2,854	2.21 కోట్లు
2022	640.5	1,139	75.52 లక్షలు
2023	1,462.59	2,035	2.82 కోట్లు
మొత్తం	7,556.68	1,2964	15.19 కోట్లు

- ఐదేళ్లలో 12,964 మంది రైతులకు సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ
- ఏటా దిబ్బతీస్తున్న వడగళ్లు, అకాల వర్షాలు, పెనుగాలులు
- పంట నష్టానికి సీజన్ ముగిసేలోపు రైతులకు పెట్టుబడి రాయితీ

నంద్యాల(సెంట్రల్):జిల్లాలో పండ్లతోటల రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా సాయం అందిస్తోంది. కరవును అధిగమించాలంటే ఉద్యాన రంగాన్ని ప్రోత్సహించాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ రంగానికి పెద్దపీట వేశారు. ఎంఐడీహెచ్, ఆర్ కేవీవై కింద ఏటా వివిధ పథకాల అమలుతో పాటు చీనీ, దానిమ్మ, అరటి, టమాట, ద్రాక్ష లాంటి పంటలకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని వర్తింపజేసి పెద్ద ఎత్తున పరిహారం అందజేశారు. వీటితో పాటు ప్రకృతి విపత్తుల కారణంగా దెబ్బతిన్న పండ్లతోటల రైతులకు పెట్టుబడి సాయం (ఇన్‌పుట్ సబ్సిడీ) అందిస్తూ అండగా నిలిచారు. అది కూడా గతంలో చంద్రబాబు ప్రభుత్వంలా చిన్నచూపు చూడకుండా ఏ సీజన్లో దెబ్బతిన్న పంటలకు అదే సీజన్లోనే పరిహారం ఇచ్చి ఆదుకుంటుండడం గమనార్హం.

రూ.15.19 కోట్లు ఇన్‌పుట్..

ఏటా ఏప్రిల్, మే నెలల్లో సంభవించిన పెను గాలులు, భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న అరటి, బొప్పాయి, జామ, సపోటా, మామిడి, ఆకు, వక్క, టమాట తదితర అన్ని రకాల ఉద్యాన పంటలను క్షేత్రస్థాయిలో నష్టం అంచనా వేసి ఈ-క్రాప్ ఆధారంగా అత్యంత పారదర్శకంగా పరిహారం ఇస్తూ వస్తున్నారు. గత ఐదేళ్లలో 7556.68 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలకు 12,964 మంది ఉద్యాన రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి రూ.15.19 కోట్ల వరకు పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) పరిహారాన్ని నేరుగా జమ చేయడంతో రైతులు నష్టాలను అధిగమించారు. గతంలో ఈ ఏడాది దెబ్బతింటే వచ్చే ఏడాదికి కాని పరిహారం అందే పరిస్థితి లేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. చాలా సార్లు చంద్రబాబు ప్రభుత్వం ఇన్పుట్ సబ్సిడీ ఎగ్గొట్టి రైతులను దగా చేసిన దాఖలాలు ఉన్నాయని పేర్కొంటున్నారు.

ఏపీఎస్పీ డీఐజీకి ఘనంగా వీడ్కోలు

కర్నూలు: సుదీర్ఘ కాలం పాటు పనిచేసి పదవీ విరమణ పొందిన ఏపీఎస్పీ కర్నూలు రేంజ్-3 డీఐజీ సీహెచ్ వెంకటేశ్వర్లుకు కర్నూలు ఏపీఎస్పీ రెండవ బెటాలియన్ ఉద్యోగులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. రెండో పటాలం కమాండెంట్ ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పరేడ్ (కవాతు) అట్టహాసంగా సాగింది. వెంకటేశ్వర్లు, భూలక్ష్మి దంపతులను శాలువ, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలను అందజేసి పరిశీలన వాహనంలో ఊరేగించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ పోలీసు శాఖకు వెంకటేశ్వర్లు అందించిన సేవలను కొనియాడారు. సన్మాన గ్రహీత వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధికారులు కింది ఉద్యోగుల పట్ల, సమాజం పట్ల నడుచుకోవలసిన అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు ఎస్ఎం బాషా, భక్తవత్సలం, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఎస్ఐలు, పటాలం సిబ్బంది పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

తప్పుడు పోస్టులు పెడితే కటకటాలే!



కర్నూలు: సామాజిక మాధ్యమాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపులు భారీగా పెరిగిపోయాయి. అభ్యర్థులు, పార్టీల నాయకులు, అభిమానులు సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉంటున్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి రావడంతో ఎన్నికల సంఘం ప్రతి అంశంపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఏర్పాటు చేసిన తనిఖీ బృందాలు సామాజిక మాధ్యమాల వేదికగా జరిగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలను గుర్తించి సుమోటోగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నారు. ఎన్నికల సందర్భంగా ఎవరైనా తప్పుడు పోస్టులు పెడితే మాత్రం తిప్పలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. పార్టీలు, అభ్యర్థుల గొప్పదనాన్ని చెప్పుకొనే క్రమంలో ప్రత్యర్థులను కించ పరిచేలా, వ్యక్తిగత దూషణలతో రెచ్చగొట్టేలా వాయిస్ మెసేజ్‌లు, ఫొటో మార్ఫింగ్, అసభ్యకర పోస్టులు పెట్టినా వారికి మద్దతు ఇస్తూ కామెంట్లు చేసిన వారిపై, గ్రూప్ అడ్మిన్‌పై కూడా కేసులు పెడతారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వారిపై ఐటీ చట్టం, ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు.

గడువులోపు పంట రుణాలు చెల్లించండి

- ఏపీజీబీ రీజినల్ మేనేజర్ శ్యామ్ నవీన్ కుమార్

కర్నూలు(అగ్రికల్చర్): పంట రుణాలను గడువులోపు చెల్లించాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ పి.శ్యామ్ నవీన్ కుమార్ రైతులకు సూచించారు. సకాలంలో చెల్లిస్తే వడ్డీ లేని పంట రుణాలు పొందేందుకు అర్హత లభిస్తుందని పేర్కొన్నారు. మంగళవారం కర్నూలులోని ఏపీజీబీ రీజినల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రూ. లక్ష వరకు పంట రుణం తీసుకొని గడువులోపు చెల్లించిన వారికి కేంద్ర ప్రభుత్వం నుంచి 3 శాతం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి నాలుగు శాతం వడ్డీ రాయితీ ఇస్తోందన్నారు. మొత్తంగా రైతులకు సున్నా వడ్డీకే పంట రుణాలు లభించినట్లు అవుతుందని పేర్కొన్నారు. రూ.3 లక్షల వరకు పంట రుణాలు పొందిన వారికి కేంద్రం నుంచి 3 శాతం వడ్డీ రాయితీ లభిస్తుందని పేర్కొన్నారు. గడువులోపు చెల్లించకపోతే సున్నా వడ్డీ లభించే అవకాశం లేదని, అపరాధపు వడ్డీ పడుతుందని పేర్కొన్నారు. సమావేశంలో సీనియర్ మేనేజర్లు, మేనేజర్లు పాల్గొన్నారు.



బాబు హామీ.. ఛూమంత్ర ఖాళీ

మాట ఇవ్వడం.. అధికారంలోకి వచ్చిన తర్వాత నాలిక మడత పెట్టడం టీడీపీ అధినేత చంద్రబాబు నైజంగా మారింది. అనేక హామీలు ఇచ్చి.. ఓట్లు వేయించుకున్న తర్వాత అమలు చేయకపోవడం ఆయనకు అలవాటే! 2014 ఎన్నికల సమయంలో 600కు పైగా వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసం చేశారు. మళ్లీ ఎన్నికలు రావడంతో హామీల ఎండమావులను సృష్టిస్తున్నారు. అద్భుత పాలన చేస్తానని, అందరికీ సంక్షేమం అందిస్తానని మాయ మాటలు చెబుతున్నారు. గతంలో టీడీపీ పాలనను చూసిన ప్రజలు చంద్రబాబు వాగ్దానాలను నమ్మడం లేదు. ఆయన హామీలన్నీ ఛూమంత్ర ఖాళీ చందమేనన్న అభిప్రాయం అంతటా వ్యక్తమవుతోంది.

కర్నూలు(అగ్రికల్చర్): అమలు చేసే హామీలైతే ఆలోచించాల్సి ఉంటుంది. అమలు చేయని హామీలను ప్రజలకు ఎన్నైనా అలవోకగా ఇవ్వొచ్చు. ఈ సూత్రాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు పాటిస్తున్నారు. 2014లో జరిగిన ఎన్నికల్లో అధికారమే పరమావధిగా 600కుపైగా హామీలు గుప్పించారు. చంద్రబాబు హామీలను నమ్మి ప్రజలు అధికారం ఇస్తే చంద్రబాబు అసలు రూపం బయటపడింది. వామ్మో... చంద్రబాబును నమ్మితే ఇలా మోసపోవాల్సి ఉంటుందనే తత్వం ప్రజలకు బోధపడింది. మళ్లీ 2024 ఎన్నికల్లో ఎలాగైన గెలిచి అధికారం చేపట్టాలనే లక్ష్యంతో సూపర్-6 అంటూ కొత్తపల్లవి అందుకున్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో బురిడీ కొట్టించేందుకు మరోసారి ప్రజల ముందుకు వస్తున్నారు. 2014 తరహాలో ఈ సారి మోసపోయే ప్రసక్తే లేదని ప్రజలు స్థిర నిర్ణయానికి వచ్చారు. 2014లో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను, అమలు చేయని తీరును గుర్తు చేసుకుంటున్నారు.

చంద్రబాబు వంచన తీరు ఇదీ...

హామీ: 2014లో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టడానికి ప్రధాన కారణం రైతుల రుణాలు మాఫీ చేస్తామనే హామీ. '' బ్యాంకుల నుంచి తీసుకున్న పంట రుణాలను ఎవరూ చెల్లించవద్దు.. నేను ముఖ్యమంత్రి అయ్యాక పంటరుణాలను మాఫీ చేస్తాను. బంగారంపై తీసుకున్న వ్యవసాయ రుణాలను కూడా చెల్లించవద్దు... వీటిని కూడా మాఫీ చేసి మీ ఆభరణాలను విడిపిస్తాను'' అంటూ చంద్రబాబు మాయ మాటలు చెప్పారు.

ఆచరణ: 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చే సమయానికి ఉమ్మడి జిల్లాలో బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు 5.25 లక్షల మంది ఉన్నారు. వీరు తీసుకున్న రుణాల మొత్తం రూ.2,750 కోట్లు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఈ మొత్తం మాఫీ కావాల్సి ఉంది. చంద్రబాబు ముఖ్యమంత్రి పదవి చేపట్టాక రైతుల వ్యవసాయ రుణాల మాఫీలో అనేక షరతులు పెట్టారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ అంటూ మెలిక పెట్టారు.. వ్యవసాయ రుణాల మాఫీ కాదు.. కేవలం ఉపశమనం మాత్రమే అంటూ మాట మార్చారు. కోతలు మీద కోతలు కోసి చివరికి అరకొరగా రూ.1,429 కోట్ల మేర ఉపశమనం కల్పించి మమ అనిపించారు.

అలవికాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు నాయుడు

- 2014లో 600పైగా హామీలు ఇచ్చి ఒక్కటి కూడా పక్కాగా అమలు చేయని టీడీపీ అధినేత
- నేడు సూపర్-6 అంటూ మరోసారి మభ్యపెట్టేందుకు యత్నాలు
- అప్పటి మోసపూరిత పాలనను గుర్తు చేసుకుని బాబూ... నిన్ను నమ్మం అంటున్న ప్రజలు

➤ ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మి పథకం కింద రూ.25వేల చొప్పున బ్యాంకులో డిపాజిట్ చేస్తామని ఊరించారు. టీడీపీ హయాంలో పుట్టిన ఆడబిడ్డలకు ఒక్క రూపాయి కూడా డిపాజిట్ చేయలేదు. అర్హులందరికీ మూడు సెంట్ల స్థలం, పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదు. రూ.10వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ అమలు చేస్తామని.. ఆచరణలో చూపలేదు. మహిళా ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి.. దాని ఊసే మరిచారు. టీడీపీ హయాంలో మహిళలకు రక్షణే లేకుండా పోయింది. ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన తహసీల్దార్ వనజాక్షిపై జరిగిన దౌర్జన్యాన్ని ఎవరూ మరచిపోలేదు. ఇలా టీడీపీ హయాంలో 600పైగానే హామీ ఇవ్వగా.. ఒక్కటీ పూర్తిగా అమలు చేయలేదు. 2024 ఎన్నికల సమయంలో మరోసారి టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారు. సూపర్ -6 అంటూ ప్రజలను మభ్యపెడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రానికి 9 ఏళ్లు, విభజిత రాష్ట్రానికి 5 ఏళ్లు మొత్తంగా 14 ఏళ్ల పాలనను చూసిన ప్రజలు బాబు... నిను నమ్మం అంటూ బహిరంగంగా చెబుతున్నారు.

హామీ: స్వయం సహాయ సంఘాలకు చెందిన డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామంటూ చంద్రబాబు ప్రకటించారు. మహిళలూ.. మీరెవ్వరు బ్యాంకుల నుంచి తీసుకున్న లింకేజీ రుణాలను చెల్లించవద్దు.. నేనొచ్చిన తర్వాత మాఫీ చేస్తానంటూ మాయ చేశారు. చంద్రబాబు హామీ ప్రకారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో 43,960 సంఘాలకు రూ.769 కోట్లు మాఫీ కావాల్సి ఉంది.

ఆచరణ: చంద్రబాబు అధికారం చేపట్టిన వెంటనే స్వయం సహాయక సంఘాలకు చెందిన డ్వాక్రా రుణాల మాఫీ హామీకి తిలోదకాలు ఇచ్చారు. పెట్టుబడి నిధి ఇస్తామంటూ మాట మార్చారు. అది కూడా చేయలేదు. చంద్రబాబు మాయమాటలు నమ్మి మహిళలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను చెల్లించలేదు. దీంతో పొదుపు మహిళలపై వడ్డీ, అపరాధ వడ్డీ భారం పెరిగిపోయింది. పెరిగిపోయిన రుణాలను తీర్చలేక మహిళలు పడిన కష్టాలు అన్నీఇన్నీ కావు.

హామీ: జాబు రావాలంటే బాబు రావాలంటూ ప్రగల్భాలు పలికారు. ఇంటికో ఉద్యోగం అంటూ తెగ హడావుడి చేశారు. ఉద్యోగం ఇవ్వలేకపోతే నెలకు రూ.2000 నిరుద్యోగ భృతి చెల్లిస్తామంటూ పలికారు. 2014 ఎన్నికల సమయంలో ఈ హామీకి పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది.

ఆచరణ: ఇంటికో జాబు అనే నినాదాన్ని అధికారం చేపట్టిన మరుక్షణమే చంద్రబాబు పక్కన పెట్టేశారు. జాబు రావాలంటే బాబు రావాలంటే ప్రగల్భాలు పలికిన చంద్రబాబు ఐదేళ్లలో రాష్ట్రం మొత్తం మీద ఇచ్చిన ఉద్యోగాలు కేవలం 31 వేలు మాత్రమే.. ఉద్యోగం ఇవ్వలేకపోతే నెలకు రూ.2000 నిరుద్యోగ భృతి ఇస్తామంటూ ప్రకటించిన చంద్రబాబు ఎన్నికలకు మూడు నెలల ముందు నిరుద్యోగభృతి అంటూ టీడీపీ కార్యకర్తలకు రూ.1000 ప్రకారం ఇచ్చారు.

విశ్వసనీయత లేదు



చంద్రబాబు పరిపాలనను 14 ఏళ్లు చూశాం. ఎన్నికల ముందు అధికారం కోసం ఎన్ని హామీలు ఇవ్వాలో అన్నీ ఇస్తారు.. ఎన్నికల అనంతరం వాటిని పక్కనబెడుతారు. 2014 అసెంబ్లీ ఎన్నికల సమయంలో పంటరుణాలు, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామన్నారు. ఈ హామీల అమలును ఆచరణలో నీరుగార్చారు. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో చంద్రబాబు అనేక హామీలు ఇస్తున్నారు. వాటికి విశ్వసనీయత లేదు. వాటిని ఎవరూ నమ్మే పరిస్థితి లేదు.

– ఈశ్వరయ్య, చిన్నటేకూరు, కల్లూరు మండలం

అన్నీ అబద్ధాలే



టీడీపీ అధినేత చంద్రబాబు రైతులను, మహిళలను, నిరుద్యోగులను ఇలా అందరినీ మోసం చేశారు. రుణమాఫీ పేరుతో రైతులను నట్టేట ముంచారు. పొదుపు మహిళలను మోసం చేశారు. ఇంటికో జాబు అంటూ నిరుద్యోగులను మోసం చేశారు. మళ్లీ ఎన్నికలు వస్తుండటంతో సూపర్-6 అంటూ ఎన్నో హామీలు గుప్పిస్తున్నారు. ప్రజలు ఆయనను నమ్మడానికి సిద్ధం లేరు. చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే. ఆయన చేసే దగా.. వెన్నుపోట్లు అందరికీ గుర్తున్నాయి.

– సిగరమాను కృష్ణమూర్తి, కంబాలపాడు గ్రామం, కృష్ణగిరి మండలం

ఎవరూ నమ్మరు



చంద్రబాబు హామీలను ఎవరూ నమ్మే స్థితిలో లేరు. 2014 ఎన్నికల సమయంలో 600కుపైగానే హామీలు ఇచ్చి ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. ఇంటికో జాబు అంటూ నిరుద్యోగులను మోసం చేశారు. రుణమాఫీ చేయకుండా రైతులు, మహిళలను నట్టేట ముంచారు. సూపర్-6 అంటూ ప్రజల్లోకి వస్తున్న చంద్రబాబును మళ్లీ నమ్మే అవకాశం లేదు.

– బిల్లం మహేశ్వరరెడ్డి, చైర్మన్, జిల్లా వ్యవసాయ సలహా మండలి, కర్నూలు



కౌతాళం: హోల్వి రోడ్డు షోలో ప్రసంగిస్తున్న మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



నంద్యాల: ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భారీగా పాల్గొన్న 42వ వార్డు ప్రజలు



ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



మహానంది: వైఎస్సార్‌సీపీ ప్రచారానికి భారీగా తరలివచ్చిన గాజులపల్లె ప్రజలు

ప్రచారంలో.. ప్రజాశీస్సులు

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రచారానికి ప్రజలు పోటెత్తుతున్నారు. అడుగడుగునా నీరాజనాలు పలుకుతున్నారు. సంక్షేమ పాలనలో తామంతా సంతోషంగా ఉన్నామని, ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపిస్తామని చెబుతున్నారు. దీంతో ప్రచారానికి వెళ్లిన పార్టీ నేతలు ప్రజాశీస్సులు అందుకుని విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

-సాక్షినెట్‌వర్క్



ఆలూరు: గుమ్మనూరులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి, వైకుంఠం మల్లికార్జునచౌదరికి స్వాగతం పలికిన గ్రామస్తులు



ఉయ్యాలవాడ: పెద్దయమ్మనూరులో ప్రజలకు అభివాదం చేస్తున్న నంద్యాల ఎంపీ పోచా, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల



పాములపాడు: ప్రచారంలో భాగంగా వృద్ధురాలి కంటిని పరీక్షిస్తున్న నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ధారాసుధీర్



పత్తికొండ రూరల్: ఇస్త్రీ చేస్తూ రజకులకు అందిన సంక్షేమ పథకాలను గురించి తెలుసుకుంటున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



గూడూరు రూరల్: పొన్నకల్‌లో ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ కోడుమూరు అభ్యర్థి ఆదిమూలపు సతీష్



ఎమ్మిగనూరు రూరల్: పెసలదిన్నెలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక



డోన్: సీసంగుంతల గ్రామంలో మాట్లాడుతున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



గడివేముల: ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి



ఆదోనిటౌన్: 18వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



బనగానపల్లె: ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



కర్నూలు: సీతారామ్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్

కర్నూలు అసెంబ్లీకి రెండో బ్యాలెట్ యూనిట్ కేటాయింపు

- రాజకీయ ప్రతినిధుల సమక్షంలో సప్లిమెంటరీ ఈవీఎం ర్యాండమైజేషన్ ప్రక్రియ
- మే 4,5 తేదీల్లో కర్నూలు పార్లమెంట్ ఈవీఎం కమిషనింగ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): కర్నూలు అసెంబ్లీకి సంబంధించి రెండో బ్యాలెట్ యూనిట్‌ను కేటాయించినట్లు జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా రెండో బ్యాలెట్ యూనిట్ కేటాయింపు ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఒక్క బ్యాలెట్ యూనిట్‌లో నోటాతో కలిపి 16 మంది అభ్యర్థుల వరకు ఉంటే ఒక్క యూనిట్‌నే వాడేందుకు వీలవుతుందన్నారు. అయితే, కర్నూలు పార్లమెంట్‌కు 19 మంది, కర్నూలు అసెంబ్లీకి 25 మంది అభ్యర్థులు పోటీలో ఉండడంతో రెండో బ్యాలెట్ యూనిట్‌ను వాడాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో కర్నూలు అసెంబ్లీకి సంబంధించి రెండో బ్యాలెట్ యూనిట్‌ను సప్లిమెంటరీ ఈవీఎం ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టామన్నారు. గతంలో అన్ని నియోజకవర్గాలకు కేటాయించిన వాటికి రిజర్వ్‌లో ఉన్న 631 బ్యాలెట్ యూనిట్ల నుంచి 309 యూనిట్లను కర్నూలు అసెంబ్లీకి సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ద్వారా రెండు బ్యాలెట్ యూనిట్లకు కేటాయించినట్లు చెప్పారు. కర్నూలు పార్లమెంట్‌కు అవసరమయ్యే సప్లిమెంటరీ రెండో బ్యాలెట్ యూనిట్లను బయటి నుంచి తీసుకురావాల్సి ఉందని, వచ్చిన తరువాత అన్ని పరిశీలించి.. మే 4,5 తేదీల్లో వాటికి కూడా సప్లిమెంటరీ ర్యాండమేషన్ ప్రక్రియ ద్వారా రెండో బ్యాలెట్ యూనిట్ కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో మధుసూదన్‌రావు, డీపీఓ నాగరాజునాయుడు, రాజకీయ పార్టీల ప్రతినిధుల్లో బీజేపీ నుంచి సాయిప్రదీప్, సీపీఎం నుంచి కేవీ నారాయణ, టీడీపీ నుంచి కె.నాగేంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ నుంచి కె.పుల్లారెడ్డి పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌వీ సూపరింటెండెంట్‌కు సత్కారం



నాగమణి దంపతులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసయ్య, సిబ్బంది

కర్నూలు (హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖ ప్రాంగణంలోని ప్రాంతీయ శిక్షణ కేంద్రం (స్త్రీలు)లో ఎల్‌హెచ్‌వీ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ నాగమణిని మంగళవారం ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ సందర్భంగా ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ హెల్త్ ఎడ్యుకేషన్ మీడియా ఆఫీసర్స్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎండీ నవాజ్ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగమణి సేవల గురించి వివరించారు. 38 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా శ్రీకాకుళం, విశాఖ, కర్నూలు జిల్లాల్లో సేవలు అందించారన్నారు. ఆమె 1986లో స్టాఫ్ నర్సుగా శ్రీకాకుళంలో ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రాంతీయ శిక్షణా కేంద్రం (స్త్రీలు) ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసయ్య, మేల్ ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత, ఎపడమాలజిస్ట్ హిమబిందు, డాక్టర్ రంగారెడ్డి, డాక్టర్ కరుణ పాల్గొన్నారు.

శ్రీశ్రీ సాహిత్యం నిత్య నూతనం



శ్రీశ్రీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కవులు, రచయితలు

కర్నూలు కల్చరల్: శ్రీశ్రీ సాహిత్యం నిత్య నూతనమని పలువురు సాహితీ వేత్తలు అభిప్రాయపడ్డారు. తెలుగు కళ్లం సాహితీ సమితి ఆధ్వర్యంలో మంగళవారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో శ్రీశ్రీ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించి మాట్లాడారు. సాహిత్యంలో శ్రీశ్రీ నూతన ఒరవడిని సృష్టించారన్నారు. విప్లవ కవిగా, సినీ రచయితగా సమాజాన్ని చైతన్య పరిచేలా ఎన్నో రచనలు చేశారన్నారు. భూస్వామ్య, పెట్టుబడి దారి విధానం పోవాలని, శ్రామిక, కర్షక, కార్మిక జీవన విధానం బలోపేతం చేసేందుకు కవిత్వం రాశారన్నారు. తెలుగు కళ్లం సాహితీ సమితి అధ్యక్షుడు డాక్టర్ చిన్నావుల వేంకటరాజారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సమన్వయకర్త డాక్టర్ ఎం. హరికిషన్, ఎలమర్తి రమణయ్య, పోతన్న, ప్రమోద్, బసవరాజు, చంద్రమౌళిని, హనుమంతప్ప, స్వర్ణలత, సూర్యశ్రీ, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి పాల్గొన్నారు.